సాక్షి నల్లగొండ

మంగళవారం । 5 । నవంబర్ । 2024



గుప్తనిధుల కోసం..

శాలిగౌరారం మండలం ఆకారంలోని సూర్య దేవాలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 587.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 46,506 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 46,506 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,191 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,767 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,948 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,200
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 738.37 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 738.37 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్



అగ్రరాజ్యంలో ఎన్నికలపై మనోళ్ల ఉత్కంఠ

- నేడు అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్
- రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్‌ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ మధ్య హోరాహోరీ
- విజయం ఎవరిని వరిస్తుందోనని చర్చ

అక్కడ ఓటుహక్కు కలిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా వాసుల మనోగతం

- 8లో







● కార్తీక పూజలు

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా నల్లగొండలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, శివలింగాన్ని అలంకరించిన భక్తులు, కార్తీక దీపాలను కోనేరులో వదులుతున్న మహిళలు

మిల్లులకే ధాన్యం..!

మొదటిసారిగా బ్యాంకు గ్యారంటీతో అప్పగింత

- సీఎంఆర్ కోసం మిల్లులకు ధాన్యం పంపిస్తున్న యంత్రాంగం
- ఇక నుంచి వేగం పుంజుకోనున్న ధాన్యం కొనుగోళ్లు
- సన్న ధాన్యం విషయంలో కొనసాగుతున్న ప్రతిష్టంభన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో మిల్లర్లకు ధాన్యం అప్పగింత మొదలైంది. గతంలో ఎప్పుడు లేనివిధంగా ఈసారి రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు గ్యారంటీతో మిల్లులకు ధాన్యం ఇస్తోంది. గతంలో కొందరు మిల్లర్లు ధాన్యం తీసుకొని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వకుండా మొండికేయడంతో వారి నుంచి బియ్యం రాబట్టడంలో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ తొలుత మిల్లర్లు దానికి అంగీకరించలేదు. కానీ ప్రభుత్వం.. గ్యారంటీ తప్పనిసరని, అదిలేకుండా ధాన్యం ఇచ్చేది లేదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో మిల్లర్లు అందుకు అంగీకరించారు. దీంతో ప్రభుత్వం మిల్లులకు సీఎంఆర్ కోటాను కేటాయించింది. ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని మిల్లులకు పంపించే ప్రక్రియను సోమవారం ప్రారంభించింది. ఇక నుంచి ధాన్యం కొనుగోళ్లలో వేగం పుంజుకోనుంది. కానీ సన్నధాన్యం విషయంలో మాత్రం ప్రతిష్టంభన కొనసాగుతోంది.

సామర్థ్యం మేరకే ధాన్యం

జిల్లాలోని ఒక్కో మిల్లుకు గతంలో సామర్థ్యానికి మించి 200 శాతం ధాన్యం ఇచ్చేవారు. ఈసారి మాత్రం వంద శాతానికి పరిమితం చేశారు. ఒక వేళ మిల్లర్ 50 శాతమే కావాలని అడిగితే అంతమేరకు ఇస్తారు తప్ప అధికంగా ఇచ్చేది లేదు. అవసరమైతే ఆ ధాన్యాన్ని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుచాలని నిర్ణయించారు. మిల్లుల సామర్థ్యం మేరకు ధాన్యం ఇచ్చేలా నిర్ణయించారు.

10 శాతం బ్యాంకు గ్యారంటీ అంటే..

మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం విలువలో 10 శాతానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ మిల్లర్ బియ్యం ఇవ్వకపోతే ఆ గ్యారంటీ కింద జమ చేసే డబ్బును జప్తు చేసుకునే అధికారం పౌరసరఫరాల సంస్థకు ఉంటుంది. మిల్లర్ 100 శాతం ధాన్యం తీసుకున్నా, 50 శాతం ధాన్యం తీసుకున్నా ఆ మేరకు కచ్చితంగా పది శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సిందే. బ్యాంకు గ్యారెంటీ విషయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ అధికారులు మిల్లర్లను ఒప్పించి సక్సెస్ అయ్యారు. రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలోనే మొదట మిల్లర్లు బ్యాంకు గ్యారంటీతో ధాన్యం దిగుమతి చేసుకోవడం ప్రారంభించారు.

ట్యాగింగ్ ద్వారా ధాన్యం అప్పగింత

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు బియ్యాన్ని అప్పగించే విషయంలో పక్కా ఏర్పాట్లు చేశారు. ఏ కొనుగోలు కేంద్రం నుంచి ఏ మిల్లుకు ధాన్యం ఇవ్వాలనే దానిపై అధికారులు ట్యాగింగ్ చేస్తున్నారు. ఇప్పటికే 50 లారీలను 20 మిల్లులకు పంపించారు.

నల్లగొండలోనే ఫస్ట్ బ్యాంకు గ్యారంటీ

రాష్ట్రంలో మొట్టమొదట బ్యాంకు గ్యారంటీతో ధాన్యం మిల్లర్లకు ఇస్తున్న జిల్లాగా నల్లగొండ నిలిచింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో మిల్లర్లతో సమావేశం నిర్వహించి ఒప్పించాం. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లారీలను మిల్లులకు పంపిస్తున్నాం. రైతులు 17 శాతం తేమ వచ్చేలా చూసుకోవడంతో పాటు మంచి ధాన్యం కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలి.

– వెంకటేశ్వర్లు, డీఎస్ఓ

జిల్లాలో 145 మిల్లులకు ధాన్యం

జిల్లాలో మొత్తం 145 మిల్లులు ఉన్నాయి. అందులో 115 మిల్లులపై ఎలాంటి కేసులు లేవు. మరో 30 మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని ఆలస్యంగా ఇవ్వడంతో ఫైన్ వేశారు. ఆ ఫైన్ కూడా ఆలస్యంగా చెల్లించడంతో వారిని మన్నించి ఆ మిల్లులకు కూడా 10 శాతం బ్యాంకు గ్యారెంటీతో ధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

కొనుగోళ్లలో పెరగనున్న వేగం

అక్టోబర్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనా మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వమే గోదాముల్లో భద్రపరిచింది. అవి నిండిపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతూ వచ్చాయి. ఇప్పటివరకు 345 కేంద్రాల ద్వారా 14,370 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ప్రస్తుతం మిల్లులకు ధాన్యం తీసుకోవడం ప్రారంభం కావడంతో కొనుగోళ్లలోనూ వేగం పెరుగనుంది.

పదేళ్ల తరువాత మళ్లీ గ్యారంటీ

బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు వ్యక్తిగత పూచికత్తుతో మిల్లర్లకు ధాన్యం ఇచ్చేవారు. మిల్లులు సీఎంఆర్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తే ఆ గ్యారంటీ ఉండటం వల్ల వారిపై ఒత్తిడి తెచ్చి ఆ బియ్యాన్ని రాబట్టుకునేవారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యారెంటీలను తొలగించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా భారీగా పెంచింది. మిల్లర్లకు కూడా సామర్థ్యాన్ని మించి ధాన్యం అప్పగిస్తూ వచ్చింది. ఎలాంటి గ్యారంటీ పెట్టుకోలేదు. దీంతో చాలా చోట్ల మిల్లర్లు ధాన్యాన్ని అమ్ముకొని ప్రభుత్వానికి బియ్యం ఇవ్వలేదు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీని తప్పనిసరి చేసింది. ఇది పౌర సరఫరాల శాఖలో చారిత్రాత్మక నిర్ణయమే అని చెప్పవచ్చు. మిల్లర్లు ఇకపై సీఎంఆర్ కింద తీసుకునే ధాన్యాన్ని మరాడించి సీఎంఆర్ ఇవ్వకపోతే ఆ గ్యారెంటీ ఆధారంగా వసూలు చేసుకునే వీలు కలిగింది.

న్యూస్‌రీల్

నైపుణ్యాల పెంపునకు అదనపు కోర్సులు

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

నల్లగొండ రూరల్ : విద్యా ప్రమాణాలు, నైపుణ్యాల పెంపు కోసం అదనపు కోర్సులు నిర్వహించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం యూనివర్సిటీలో అన్ని శాఖల అధిపతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నైపుణ్యాలు పెంచేందుకు ప్రతి విభాగం నుంచి అదనపు కోర్సులు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు అదనంగా నైపుణ్య శిక్షణలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది క్వార్టర్స్‌లో నివసించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, అధ్యాపకులు రవి, రమేష్, ఉపేందర్‌రెడ్డి, శ్రీదేవి, అరుణ ప్రియ, సుధారాణి, మాధురి, రూప, తిరుమల, రామచంద్రగౌడ్, రమేష్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థుల జవాబు పత్రాలను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

పెద్దవూర : పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి తెలిపారు. సోమవారం పెద్దవూర జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, మధ్యాహ్న భోజనాన్ని, పదో తరగతి ఎస్ఏ-1 పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించారు. ఒకో ఉపాధ్యాయుడి పేరు పిలుస్తూ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. సకాలంలో సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్ చేయించాలన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ తరి రాములు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌తో విద్యార్థుల జీవితాల్లో మార్పు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ : పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు అందించడం ద్వారా షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల జీవితాల్లో మార్పులు తీసుకురావచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలపై కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నూతన విధివిధానాలపై జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్, శాఖధిపతులకు సోమవారం ఉదయాదిత్య భవన్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్పులపై కేంద్ర ప్రభుత్వం నూతన విధివిధానాలు జారీ చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని.. ఉపకార వేతనాలకు కూడా ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్, షెడ్యూల్డ్ కులాల శాఖాధికారులు చిత్తశుద్ధితో పనిచేసి విద్యార్థులకు సకాలంలో పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ, జిల్లా పరిశ్రమల శాఖ జేడీ కోటేశ్వరరావు, రమణారావు, ఎల్‌డీఎం శ్రామిక్, డీఐఈఓ దస్రూనాయక్, శ్రవణ్ కుమార్, వినయ్ కృష్ణ పాల్గొన్నారు.

సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలి

ఇంటింటి కుటుంబ సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఇది జన గణన, కుల గణన కాదని కేవలం సమాచార సేకరణ మాత్రమేనన్నారు. ఎన్యూమరేటర్లు మున్సిపల్, గ్రామస్థాయిలో వార్డు మొదలుకొని కేటాయించిన బ్లాక్ స్థాయి వరకు పూర్తిస్థాయిలో సమాచార సేకరణ, నమోదును జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సర్వేపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 45 మంది ఫిర్యాదులు అందించారు. పింఛన్లు, విద్య, ఉపాధి, వ్యక్తిగత అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ ప్రాధాన్య పథకాలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఇంటింటి సమగ్ర సర్వేలో పకడ్బందీగా నిర్వహించేందుకుగాను జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లలతో మత్స్యకారులకు ఉపాధి



చర్లపల్లి చెరువులో చేప పిల్లలు వదులుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి చరిత, నాయకులు

నల్లగొండ టూటౌన్ : మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడానికే ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మత్స్యశాఖ జిల్లా అధికారి చరిత అన్నారు. సోమవారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి భీమ సముద్రంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నిండిన అన్ని చెరువులు, కుంటల్లో ఉచిత చేప పిల్లలను పోయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు చేప పిల్లలను పెంచి వాటి ఉపాధి పొందాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య సంఘాల నాయకులు మెరుగు వెంకన్న, శ్రీను, ఏర్పుల రవి, సింగం లక్ష్మి, భాస్కర్‌గౌడ్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలం నర్సింగ్‌బట్లలో కొత్తచెరువు, గంగదేవి చెరువుల్లో సోమవారం జిల్లా మత్స్య శాఖ అధికారి చరిత లక్షా 5 వేల చేప పిల్లలను వదిలారు. చేప పిల్లల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయం

● ఎంపీ రఘువీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం దామరచర్ల మండలంలోని కల్లేపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 3న మిర్యాలగూడ పట్టణంలో జరిగిన బీసీ గర్జన సభలో మల్లన్న కులాల వారీగా మాట్లాడుతూ కామెంట్లు చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ బీఫాంపై గెలిచి పార్టీ నేతలపైనే ఆయన దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్న గెలుపు కోసం తామంతా కృషి చేశామని తెలిపారు. ఈ విధమైన వ్యాఖ్యల వల్ల కాంగ్రెస్ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు, పొరపచ్చాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మల్లన్న ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుని పార్టీకి నష్టం లేకుండా పని చేయాలన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

నల్లగొండ టౌన్ : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో లేబర్ డిపార్ట్‌మెంట్ సహకారంతో 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల లేబర్ కార్డున్న స్త్రీ, పురుషులకు 15 రోజుల ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఏడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఎలక్ట్రిషియన్, తాపిమేస్త్రీ, పెయింటింగ్ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నామని ఈ 15 రోజులకు రూ.4500 ఉపకార వేతనం, మధ్యాహ్న భోజనం, స్టేషనరీ, టీషర్టు, హెల్మెట్, బ్యాగు ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. దరఖాస్తు కోసం 78933 32674, 90594 64647, 94417 95590 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ విధానంతో అందరికీ లాభం



నార్కట్‌పల్లి : ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఎస్.చౌహాన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్.చౌహాన్
- చిట్యాల, నార్కట్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

చిట్యాల, నార్కట్‌పల్లి : వానాకాలం సీజన్‌లో ధాన్యం సేకరణ వేగవంతంగా కొనసాగేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంలో రైతులతో పాటు, రైస్‌మిల్లర్స్, రేషన్‌కార్డుదారులకు లాభాదాయకంగా ఉంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్.చౌహాన్ పేర్కొన్నారు. చిట్యాల, నార్కట్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాత్రి ఆయన నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విధానంలో సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తుందని, రైస్ మిల్లర్స్‌కు మిల్లింగ్ చార్జీ దొడ్డు ధాన్యం క్వింటాకు రూ.40, సన్న ధాన్యం క్వింటాకు రూ.50 అందజేస్తుందని తెలిపారు. పది శాతం బ్యాంకు గ్యారెంటీతో మిల్లర్లకు ధన్యాం అందజేస్తున్నామని, ఇతర రాష్ట్రాల్లో వంద శాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకుంటున్నారని తెలిపారు. సీఎంఆర్ చెల్లించిన వెంటనే బ్యాంకు గ్యారెంటీని రిలీజ్ చేస్తామన్నారు. జనవరి నుంచి 2.18 కోట్ల రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం అందజేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్యాడీ క్లీనర్లను అందజేసేందుకుగాను రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రైతులు 17 తేమశాతం ఉన్న ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, డీసీఓ పత్యానాయక్, తహసీల్దార్లు కృష్ణనాయక్, వెంకటేశ్వర్‌రావు, సీఈఓ బ్రహ్మచారి, సిబ్బంది నాగారాజు, మిల్లర్స్ తేరటుపల్లి హన్మంతు, పందిరి శ్రీనివాసులు, పోలా పెద్దయ్య, వేలుపల్లి రమేష్, వనపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో అక్రమ బదిలీలు

- ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో ఇద్దరు ఉద్యోగుల పరస్పర బదిలీ
- విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు



నల్లగొండ : విద్యుత్ శాఖలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు డివిజన్‌లో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగుల వద్ద ముడుపులు తీసుకుని పరస్పర బదిలీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు.

గత నెలలోనే బదిలీలు..

విద్యుత్ శాఖలో అటెండర్లు మొదలుకుని అధికారుల వరకు గత నెలలో బదిలీలు జరిగాయి. అందులో భాగంగా నల్లగొండలోని ట్రాన్స్‌ఫార్మర్ల మర్మమ్మతు డివిజన్‌లో కూడా డీఈ బదిలీలు చేపట్టారు. బదిలీలకు సంబంధించి ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఆధ్వర్యంలో నిబంధనలు విడుదలయ్యాయి. మూడేళ్లు కొకే చోట పని చేసిన వారినే బదిలీ చేస్తామని నిబంధన విధించింది. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు కూడా అవకావం లేదు. కానీ నిబంధనలను తుంగలో తొక్కి ట్రాన్స్‌ఫర్ పాలసీలో లేని వారిని అక్కడే ఉన్న రెండు షెడ్లలో అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు బదిలీలు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

నల్లగొండలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో ఆర్‌కేఐ ఎస్పీఎం షెడ్‌లో పని చేస్తున్న టెస్టర్ గ్రేడ్ 1 ఉద్యోగిని పక్కనే ఉన్న సుశి ఎస్పీఎం షెడ్‌కు బదిలీ చేశారు. సుశి ఎస్పీఎం షెడ్‌లో గ్రేడ్2 ఉద్యోగిని ఆర్‌కేఐ ఎస్పీఎం షెడ్‌కు బదిలీ చేశారు. ఈ ఉద్యోగులు ఇద్దరూ 2022 వరకు ప్రస్తుతం బదిలీ అయిన షెడ్లలోనే పని చేశారు. వారు బదిలీ అయి రెండు సంవత్సరాలే అయ్యింది. వచ్చే సంవత్సరం ఇక్కడే ఉంటే బదిలీ కావాల్సి వస్తుందనే ఉద్దేశంతో వీరు ఒకరు పని చేస్తున్న చోటుకు మరొకరు పరస్పరం బదిలీ చేయించుకున్నారు. ఈ విషయంలో పెద్ద మొత్తంలో చేతులు మారినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో చాలా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాలు ఉన్నాయి. ఈ ఉద్యోగులు కొన్నేళ్లుగా నల్లగొండలోనే పనిచేస్తున్నారు.. ఇప్పటివరకు రూరల్ ప్రాంతాలకు వెళ్లలేదు. అలా వెళ్లకున్నా టీఆర్ఈ ప్రొటెక్షన్, ఎల్‌టీ మీటర్లు, హెచ్‌టీ మీటర్లు వింగ్‌లోకి కూడా బదిలీ చేయవచ్చు. కానీ అక్కడే ఉన్న ఎస్పీఎం షెడ్లలోకి వీరిని బదిలీ చేశారు.

విజిలెన్స్ అధికారుల విచారణ

అక్రమ బదిలీలపై విద్యుత్ శాఖలోని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు శనివారం టీఆర్ డీఈ వద్ద వివరణ తీసుకున్నట్లు తెలిసింది. గత నెల 14వ తేదీన బదిలీ అయిన డీఈ సదరు ఉద్యోగులను బదిలీ చేశారు. ప్రస్తుతం వచ్చిన డీఈ వద్ద ఆ ఇద్దరు ఎప్పటి నుంచి ఎక్కడెక్కడ పని చేశారు అనే వివరాలు అడిగి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై నల్లగొండ ఎస్ఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా బదిలీలన్నీ అంతకు ముందున్న ఎస్ఈ సమయంలోనే జరిగాయని.. ఇంకా ఈ విషయం తన దృష్టికి రాలేదు. ఫిర్యాదు వచ్చే విచారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

డెడికేటెడ్ కమిటీ మెంబర్ సెక్రటరీగా చౌటుప్పల్ వాసి


బడుగు సైదులు

చౌటుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బీసీ కుల గణనకు సంబంధించి హైకోర్టు సూచన మేరకు ప్రత్యేకంగా డెడికేషన్ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావును నియమించగా.. మెంబర్ సెక్రెటరీగా ఐఎఫ్ఎస్ అధికారి బడుగు సైదులు నియమితులయ్యారు. సైదులు స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్. ఉమ్మడి రాష్ట్రంలో ఐఎఫ్ఎస్ అధికారిగా వివిధ జిల్లాల్లో సేవలందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర సంక్షేమ గురుకులాల కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. బీసీ కులగణన నివేదిక సమర్పించే కమిటీలో చౌటుప్పల్‌కు చెందిన వ్యక్తి నియమితులవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

త్రిపురారం : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం త్రిపురారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటి గూడేనికి చెందిన కుంచం సైదులు(45) తన పొలంలో విద్యుత్ మోటార్ బంద్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. సైదులు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరు దుర్మరణం

యాదగిరిగుట్ట రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన యాదగిరిగుట్ట పట్టణంలోని టెంపుల్ సిటీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడేనికి చెందిన గజ్జి నర్సింహ (43) యాదాద్రి టెంపుల్ సిటీ పరిధిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో టీఎస్25ఏ7137 గల ట్రాక్టర్‌ను తీసుకుని టెంపుల్ సిటీ పరిధిలో చెట్లకు నీళ్లు పోయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నడుపుతున్న నీళ్ల ట్యాంకర్‌ను డివైడర్‌కు గుద్దడంతో ట్రాక్టర్ ఒక పక్కకు బోల్తా పడింది. దీంతో డ్రైవర్ నర్సింహ కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలో మృతి చెందాడు. ట్రాక్టర్ బోల్తా పడిన సమయంలో మృతుడికి ఫిట్స్ కూడా వచ్చాయని స్థానికులు చెబుతున్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

అగ్రరాజ్యంలో ఎన్నికలపై మనోళ్ల ఉత్కంఠ

- కొందరు ట్రంప్‌కు, మరికొందరు కమలాహారిస్‌కు మద్దతు
- గెలుపు అవకాశాలు ఇద్దరికీ ఉన్నాయని విశ్లేషణ
- అమెరికాలో ఓటుహక్కు కలిగి ఉన్న.. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురి మనోగతం



ప్రపంచంలో అగ్రరాజ్యమైన అమెరికాకు మనదేశం నుంచి ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం వేలాది మంది వెళ్తుంటారు. ఇప్పటికే చాలామంది అక్కడి వెళ్లి స్థిరపడ్డారు. ఆ దేశంలో ఈనెల 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలాహారిస్ బరిలో నిలిచారు. వీరిలో ఎవరు గెలుస్తారోనని యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అమెరికాలో ఓటుహక్కు వినియోగించుకోనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లో..

కమలా హారిస్‌కే విజయావకాశాలు ఎక్కువ



కోదాడ: మాది కోదాడ. మేము ఉద్యోగ రీత్యా అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్‌కే ఎక్కువ విజయావకాలున్నాయి. ఇతర దేశాల నుంచి ఇక్కడ స్థిరపడిన వారిలో 80 శాతం మంది కమలకే మద్దతుగా నిలుస్తున్నారు. భారతీయులు దాదాపు కమలాహారిస్ విజయం సాధించాలని కోరుకుంటున్నారు. ఇక్కడ వారి అంచనాల ప్రకారం 2శాతం మెజార్టీతో కమల గెలుపొంది అమెరికా అధ్యక్షురాలు అవుతుంది.

- కందిబండ ప్రియాంక, నార్త్ కరోలినా

ట్రంప్ గెలవకూడదని కోరుకుంటున్నారు



కోదాడ: మా స్వస్థలం కోదాడ పట్టణం. అమెరికాలోని నార్త్ కరోలినాలో స్థిరపడ్డాం. ప్రస్తుత పరిస్థితుల్లో డోనాల్డ్ ట్రంప్ గెలిస్తే ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారికి ఇబ్బందులు తప్పవనే ప్రచారం జరుగుతుంది. అమెరికన్‌లకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పడంతో ట్రంప్‌కు మద్దతిచ్చేవారు తగ్గిపోయారు. ట్రంప్ గెలవకూడదని ఎక్కువ శాతం ప్రజలు కోరుతున్నారు. నార్త్ కరోలినాలో భారతీయులు ఎక్కువగా ఉంటారు. ఇక్కడ కమలా హారిస్‌కే మద్దతు ఎక్కువగా ఉంది.

- శీరాబు కృష్ణకాంత్, నార్త్ కరోలినా

ట్రంప్ గెలిచే అవకాశం ఉంది



భువనగిరి: మాది భువనగిరి పట్టణం. అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడ్డాం. ఈ నెల 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ డెమోక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్షుడిగా బరిలో ఉన్న అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశం ఉంది. గతంలో దేశానికి అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం కూడా ఉన్న ట్రంప్ మంచి ఆర్థిక సంస్కరణలు తీసుకురాగలరు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉంటే అమెరికా–ఇండియా మధ్య సత్సంబంధా లు మెరుగుపడతాయి. రిపబ్లిక్ పార్టీకి చెందిన అభ్యర్థి కమలాహ్యారీస్ భారత సంతతికి చెందిన వారు అయినప్పటికీ ఇండియాకు చెందిన వారు ఆమెకు మద్దతు తెలపడం లేదు.

- జి.సంతోష్, కాలిఫోర్నియా

ప్రస్తుత పరిస్థితుల్లో ట్రంప్ గెలవాలి



భువనగిరి: మాది వలిగొండ మండలం టేకులసోమారం గ్రామం. అమెరికాలోని నార్త్ కరోలినాలో 23 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికలు రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల అభ్యర్థుల మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొంది. ఆరు నుంచి 7 వరకు స్వింగ్ స్టేట్స్ వీరి గెలుపును నిర్ధారిస్తాయి. ఎవరు గెలిచిన స్వల్ప మెజార్టీతో గెలుస్తారు. ఇండియన్స్ ఎక్కువ శాతం ట్రంప్ వైపు మొగ్గు చూపుతున్నారు. నేడు మాత్రం ట్రంప్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకున్నాను.

- పడమటి శ్యాంసుందర్‌రెడ్డి, నార్త్ కరోలినా

భారతదేశ అభివృద్ధికి సహకరించే వారికే ఓటేయాలి



అర్వపల్లి: మాది సూర్యాపేట జిల్లా మునగాల మండలం నర్సింహులగూడెం గ్రామం. అమెరికాలోని అట్లాంటా ఉంటున్నాం. ఇప్పటికే రెండు సార్లు అమెరికా ఎన్నికల్లో ఓటు వేశాను. భారతదేశ అభివృద్ధికి సహకరించే వారికి అమెరికా ఎన్నికల్లో భారతీయులు ఓటేయాలి. సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు, భారత విదేశాంగ విధానం, ఎగుమతి, దిగుమతికి మద్దతు తెలిపే వాళ్లకే మా ఓటు. కులాలను చూసి ఓటు వేయవద్దు.

- జూలకంటి లక్ష్మారెడ్డి, అట్లాంటా

భారతీయులు ట్రంప్ వైపే..



అర్వపల్లి: మాది సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండల కేంద్రం. అమెరికాలోని హూస్టన్‌లో స్థిరపడ్డాం. 30 ఏళ్ల పైనుంచి అక్కడే ఉంటున్నాం. ఇప్పటికే 20 సార్లు అక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నాను. అమెరికాలో ఎక్కువ మంది భారతీయులు ట్రంప్‌వైపే ఉన్నారు. నాది రిపబ్లికన్ పార్టీ. నేను ఎన్నికల్లో ట్రంప్‌కే ఓటేస్తాను.

- ఆలూరి బంగార్‌రెడ్డి, హూస్టన్

డెమోక్రటిక్ పార్టీ వైపే మొగ్గు



కోదాడ: మాది కోదాడ పట్టణం. అమెరికాలోని చికాగో నగరంలో స్థిరపడ్డాం. అధ్యక్ష్య ఎన్నికల్లో ఈ సారి ఇండియన్స్ డెమోక్రాట్స్ అభ్యర్థి కమలాహారిస్ వైపే మొగ్గు చూపుతున్నారు. స్వల్ప మెజార్టీతోనైనా కమల గెలుస్తుందనే చర్చ జరుగుతుంది. వలస చట్టాలపై ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉందని ఇతర దేశాల నుంచి అమెరికా వచ్చిన వారు భయపడుతున్నారు. ట్రంప్ కూడా తన ప్రసంగాలలో ఇతర దేశాల నుంచి వచ్చి అమెరికన్‌ల అవకాశాలను దెబ్బతీస్తున్నారని ప్రచారం చేస్తున్నారు.

- బొగ్గారపు మణిదీప్, గుడుగుంట్ల నాగలక్ష్మి, చికాగో

డోనాల్డ్ ట్రంపే గెలుస్తారు



సూర్యాపేట: మాది సూర్యాపేట పట్టణం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ సిన్సినాటి, ఒహాయో రాష్ట్రంలో ఉంటున్నాం. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌కే విజయావకాశాలు ఉన్నాయి. నేను కూడా అదే పార్టీకి ఓటేయాలనుకుంటున్నా. ఈ సారి ట్రంప్ గెలిస్తే ఉక్రెయిన్, ఇజ్రాయిల్ యుద్ధాలు ఆగిపోతాయని భావిస్తున్నాం. ట్రంప్ గెలిస్తే వ్యాపార వర్గాలకు పన్నుల్లో రాయితీ ఇస్తారని, దీంతో ద్రవ్యోల్బణం నియంత్రణ అవుతుంది.

- విజయశంకర్ కోణం, సిన్సినాటి, ఒహాయో

ట్రంప్ గెలిస్తేనే భారతీయులకు భద్రత



తిరుమలగిరి(నాగార్జునసాగర్): మాది నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం కొంపల్లి గ్రామం. నేను, నా భర్త బొలిగోర్ల శ్రీనివాస్, అలియాస్ కొంపల్లి శ్రీనివాస్ 2010లోనే అమెరికాలోని కొలంబస్‌కు వచ్చాం. అప్పటి నుంచి కొలంబస్‌లో ఉంటున్నాం. భారతీయుల భద్రత విషయంలో ట్రంప్ స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంప్ గెలుస్తేనే భారతదేశానికి గానీ, అమెరికాలో ఉంటున్న భారతీయులకు గానీ లాభం చేకూరుతుంది. కమలాహారిస్‌భారత సంతతికి చెందినప్పటికీ ఎక్కువ మంది భారతీయులు ట్రంప్ వైపే మొగ్గు చూపుతున్నారు.

- దివ్య, కొలంబస్

ట్రంప్ గెలవాలనుకుంటున్నారు



నల్లగొండ: మాది నల్లగొండ. అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లో స్థిరపడ్డాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కే విజయావకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయంగా కమలా హ్యారిస్‌కు అంతగా అనుభవం లేదని ప్రజల్లో ప్రచారం సాగుతోంది. గతంలో అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూస్తే ట్రంప్ వైపే అమెరికన్ ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ట్రంప్, కమలాహారిస్ మధ్య హోరాహోరీగా పోటీ ఉన్నా అమెరికా ప్రజలు ట్రంప్ గెలవాలనుకుంటున్నారు.

- కంచరకుంట్ల వెంకటరాంరెడ్డి, లాస్ ఏంజెల్స్

బలమైన నాయకత్వం అవసరం



ఆత్మకూర్ (ఎస్): మాది ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామం. అమెరికాలోని నార్త్ కేరోలినాలో కెమికల్ ఎనామిస్ట్‌గా స్థిరపడ్డాను. అమెరికా దేశం ముందు ఎన్నడూ చూడని సవాళ్లు ఎదుర్కొంటోంది. ధరలు పెరగడం, పెరుగుతున్న నేరాలు, సరిహద్దు భద్రత సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి బలమైన నాయకత్వం అవసరం. వైఫల్యంతో నిండిన బైడెన్ ఆర్థిక, వలస, విదేశీ విధానాల నుంచి పునరుద్ధరించడానికి ట్రంప్ గెలుపు చాలా అవసరం.

- దండ నీరజ, కెమికల్ ఎనామిస్ట్, నార్త్ కరోలినా

ట్రంప్ గెలిస్తేనే బాగుంటుంది



ఆత్మకూర్(ఎం) : మాది ఆత్మకూర్(ఎం) మండలం సిద్ధాపురం. మేము 27 సంవత్సరాల నుంచి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నివాసం ఉంటున్నాం. మంగళవారం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఉంది. అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ నుంచి ట్రంప్, డెమోక్రటికన్ పార్టీ నుంచి కమల హారిష్ పోటీ పడుతున్నారు. హోరాహోరీ పోటీలో ఎవరు గెలుస్తారో తెలియని పరిస్థితి ఉంది. ట్రంప్ ముక్కుసూటి మనిషి అయినా ఆయన గెలిస్తేనే భద్రత అనే ఉంటుందని నా అభిప్రాయం. కమలా హారిస్ అమెరికా ఉపాధ్యక్షులుగా ఉన్నా పాలన పరంగా పెద్దగా అనుభవం లేదు. ఆమె విధి విధానాలు ట్రంప్‌కు లాభం కలిగేలా ఉన్నాయి.

- ఏనుగు లక్ష్మణ్‌రెడ్డి, న్యూయార్క్

హోరాహోరీగా ఎన్నికల ప్రచారం



అర్వపల్లి: మాస్వగ్రామం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం. అమెరికాలోని టెన్నెసి రాష్ట్రంలో ఉంటున్నాం. అక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. ఈసారి అక్కడి ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు వేయబోతున్నాను. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచారం హోరాహోరీగా జరుగుతోంది. కమలాహారిస్, ట్రంప్ మధ్య పోటీ నువ్వా...నేనా అన్నట్లుగా ఉంది. భారతదేశ అభివృద్ధికి కృషిచేసే వారికే ఓటేయాలి. మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది.

- జన్నపు శ్రీదేవి, టెన్నెసి

ట్రంప్‌తోనే ఉద్యోగావకాశాలు



నేరేడుచర్ల: మాది సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల. నేడు అమెరికాలో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోబోతున్నాను. ఈ ఎన్నికల్లో రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయి. ట్రంఫ్ గెలిస్తే భారతీయులకు ఉద్యోగ అవకాశాలు సురక్షితంగా ఉంటాయి. మేము ఉన్న ప్రాంతంలో మాతో పాటుగా చాలా మంది ట్రంప్‌కు ఓటు వేసే అవకాశాలున్నాయి.

- దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, బేబికాన్

నా మద్దతు కమలాహారిస్‌కే..



శాలిగౌరారం: మాది శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామం. అమెరికాలోని మిజోరి స్టేట్‌లో స్థిరపడ్డాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో తమ కుటుంబంలో ముగ్గురం ఓటు హక్కును వినియోగించుకోనున్నాం. నేను ఓటు వేయడం ఇది మూడవసారి. నా మద్దతు కమలాహారిస్‌కే.

- పాదూరి రామమోహన్‌రెడ్డి, మిజోరి స్టేట్

గుప్తనిధుల కోసం తవ్వకాలు


ఆలయంలో జరిపిన తవ్వకాలు

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో గల పురాతన సూర్య దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపగా సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారం–వల్లాల అనుసంధాన డొంకదారి సమీపంలో వ్యవసాయ పంటపొలాల నడుమ పూర్తిగా శిథిలావస్థకు చేరి ఉన్న సూర్య దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. దేవాలయ ప్రాంగణంలో రెండు చోట్ల తవ్వకాలు చేపట్టిన దుండగులు గర్భ గుడిలో కూడా తవ్వకాలు జరిపారు. ఈ దేవాలయంలో సూర్యదేవుడి భారీ పంచలోహ విగ్రహంతో పాటు నంది, ఇతర విగ్రహాలు కూడా ఉండేవని స్థానికులు చెబుతున్నారు. పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఆలయ సమీపంలోని వ్యవసాయ భూములను కొనుగోలు చేసినప్పటి నుంచి గుప్తనిధుల కోసం ఇక్కడ తవ్వకాలు జరపడంతో పంచలోహ విగ్రహాలు మాయమయ్యాయని స్థానికులు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే మరోమారు గుప్తనిధుల కోసం దుండగులు తవ్వకాలు జరిపి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

బీబీనగర్: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన తర్రె మల్లేష్ కూతురు స్వప్న(34)కు బీబీనగర్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల గణేష్‌తో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా మానసిక వేధింపులకు గురవుతున్న స్వప్న సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఇంటి స్లాబ్‌కు గల ఉక్కుకు ఉరివేసుకొని మృతి చెందింది. కాగా తన చెల్లిని అదనపు కట్నం కోసం భర్త గణేష్, అత్త లక్ష్మమ్మ, బావ రమేష్‌లు వేధిస్తున్నారని, వారి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అన్న తర్రె నాగరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే స్వప్నను ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని చట్టరీత్యా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త గణేష్ కుటుంబ సభ్యులు తిరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి..

తిప్పర్తి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిప్పర్తి మండలం దుప్పలపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం జొన్నగడ్డలగూడేనికి చెందిన మద్రి శ్రీను (40) నల్లగొండ మండలం చర్లపల్లిలో నివాసముంటున్నాడు. అతడి భార్య ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా.. మృతుడు ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన శ్రీను సోమవారం తెల్లవారుజామున రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


రాపోలు రవితేజ (ఫైల్)

ఆలేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఆలేరు మండలంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో చోటు చేసుకుంది. సోమవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన రాపోలు ప్రకాష్ కొడుకు రవితేజ(23) బీఫార్మసీ సెకండియర్ చదువుతున్నాడు. ఆలేరు మండలం టంగుటూరు శివారులో ఓ రిసార్ట్‌లో తనతోపాటు టెన్త్ చదివిన స్నేహితులు గెట్ టు గెదర్ చేసుకున్నారు. స్నేహితులకు భోజనం తేవడానికి పల్సర్ బైక్‌పై కటకం సంజయ్‌తో కలిసి ఆలేరు టౌన్‌లోకి వెళ్లి తిరిగి రిసార్ట్‌కు వస్తున్నారు. టంగుటూరు శివారులోకి రాగానే శారా జీపేట నుంచి ఆలేరుకు వస్తున్న గుర్తు తెలియని వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. దీంతో రవితేజ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కటకం సంజయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రజినీకర్ తెలిపారు.

అర్వపల్లి శివారులో భార్యాభర్తలకు గాయాలు

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి శివారులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బూర్గుల రాంబాబు, ఆయన భార్య రజిత ఆదివారం రాత్రి అర్వపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. రాంబాబు, రజిత తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో సూర్యాపేటలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములపల్లి : ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వేములపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం రావులపెంటకు చెందిన జంగిలి శంకర్ తన ట్రాక్టర్ ద్వారా అనుమతులు లేకుండా సోమవారం ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి యజమానితోపాటు ట్రాక్టర్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు దోహదం


- డీఐఈఓ రమణి
- ఉమ్మడి నల్లగొండ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం


మాట్లాడుతున్న రమణి

భువనగిరి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా ఇంటర్మీడియేట్ నోడల్ ఆఫీసర్ సి.రమణి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 68వ ఎస్‌జీఎఫ్ అండర్–19 ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడుతాయని చెప్పారు. అనంతరం జెండా ఊపి అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజనేయులు, ప్రిన్సిపల్ పాపిరెడ్డి, అర్గనైజింగ్ సెక్రటరీ ఇందిర, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ బాలకృష్ణ, పీడీ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అథ్లెటిక్స్ 1,500 మీటర్ల పరుగు పందెం బాలికల విభాగంలో కె.శివాని, జి.స్పందన, ఎస్.సంధ్య, ఎం సాగరిక, బాలుర విభాగంలో వి.చంద్రశేఖర్, జి.మధుకర్, ఎం.ప్రమోద్, డి.ప్రవీన్ గెలుపొందారు. 400 మీటర్ల పరుగు పోటీల్లో బాలికల విభాగంలో బి.దేవిశ్రీ, డి.సంజన, జి.ఆకాంక్ష, ఎం.మౌనిక, బాలుర విభాగంలో ఎస్.రాము, ఎన్.నవీన్, కె.శివ గెలుపొందారు. డిస్కస్ త్రోలోని బాలికల విభాగంలో కె.నందిని, ఎన్.ప్రణతీ, ఉదయ్‌శ్రీ, బాలుర విభాగంలో ఎం.రాహుల్, వి.వినోద్ కుమార్, ఎస్.అక్షయ్, జావలిన్ త్రోలో బాలికల విభాగంలో హరిక, రాజేశ్వరీ, ప్రణతి గెలుపొందారు.


జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


పంగ శ్రీను (ఫైల్)

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం .. గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన పంగ శ్రీను(39) రోజు మాదిరిగానే ఉదయం 6 గంటలకు పొలం పనులకు వెళ్లాడు. మృతుడి భార్య కవిత తమ చేనులో పత్తి తీయడానికి కూలీలను వెంటబెట్టుకొని ఉదయం 9.30 గంటలకు వెళ్లింది. అప్పటికే పంగ శ్రీను అక్కడ పడి ఉండడాన్ని చూసిన భార్య అంబులెన్స్‌కు ఫోన్ చేయడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా మృతుడి ఎడమ నడుము పైభాగాన చర్మం చీలి ఉండడంతో మృతుడి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి పంగ సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.